



ప్రొఫెసర్ భట్నగర్ మూడ్రో జులక్రితమే జర్మనీనుండి తిరిగివచ్చాడు. వచ్చీరావడంతోటే తను ఎన్నో సంవత్సరాలుగా జరిపిన పరిశోధనకి ఓ రూపం ఇవ్వడానికి పూనుకున్నాడు. లక్షలు ఖరీదుచేసే పరికరాలన్నిటిని తనిఖీ చేసి అన్నీ సవ్యంగా వున్నట్లు తన అసిస్టెంటిచ్చిన రిపోర్టు చదువుకుని తృప్తిగా ఫీలయ్యాడు. తను అతి త్వరలో చేయబోతున్న ప్రయోగం ప్రపంచంలో ఓ మహా




కథా నిలయం
శ్రీకాకుళం

సంచలనాన్ని కలిగిస్తుందన్న పూర్తి నమ్మకం అతనిలో పుట్టింది. ప్రయోగంయొక్క పర్యవసానాల్ని గురించి ఎక్కువ ఆలోచించకుండా దానికి వెంటనే సన్నద్ధుడవడమే ముఖ్యంగా భావించాడు. తన పరిశోధనాశాలలో తన టేబిల్ మీద ఆవేళే అందిన మాస్కో యూనివర్సిటీ ప్రొఫెసర్ బైకోవిస్కీ ఉత్తరం తనింకా చదవలేదు.

బైకోవిస్కీతో తనకి సుమారు పాతికేళ్ళ పరిచయం వుంది. మొదటినుండీ తనుచేసే ప్రతి ప్రయోగాన్ని ఖండిస్తూ ఏదో

ఓ లోపం ఎత్తి చూపెడుతూ వచ్చాడు బైకోవిస్కీ.

ఈమధ్య నేపుల్స్‌లో జరిగిన ఓ సదస్సులో కూడా భట్నాగర్ ప్రయోగాలపట్ల నిరసన వెలిబుచ్చాడు బైకోవిస్కీ. ఇప్పుడీ ఉత్తరంలో కూడా అలాంటి నిరసనే వ్యక్తం చేసివుంటాడు! ఆ ఉత్తరం చదవడానికి మనస్కరించ లేదు ప్రొఫెసర్ భట్నాగర్‌కి.

జర్మనీనుండి రాగానే ఈ మూడు రోజుల్లో తను చేయబోయే ప్రయోగానికి సంబంధించిన అన్ని వివరాలను నిశితంగా పరిశీలించి వాటిని ఓ జాబితాకింద తయారు చేసి వుంచుకొన్నాడు. ప్రయోగాని కవసరమయ్యే పరికరాలన్నీ తన వద్ద ఉన్నాయి. తను సాధించబోయే ఫలితం నిర్దుష్టంగా తన ముందు సాక్షాత్కరించి ఉన్నది. తన ప్రయోగానికి ఎటువంటి ఆటంకం వాటిల్లకుండా వుండాలంటే ఆలస్యం చేయకూడదు. ఇతరుల అభిప్రాయాలతో తన ప్రయోగాన్ని వాయిదావేసే స్థితిలో తనిప్పుడు లేడు. బైకోవిస్కీ ఉత్తరాన్ని చింపేసి పక్కన పడవేసి ఫోన్ వేపు నడిచాడు భట్నాగర్.

* * *

అక్టోబర్ 11, సోమవారం! ఆరోజు రెండేళ్ళక్రితం కాలెండర్ షీట్ చింపినవేళకి తన మెళ్ళో మూడు ముళ్ళు వేశాడు విష్ణుసాగర్. వెడ్డింగ్ అనివర్సరీ ఆ ముందు రోజే చెప్పింది తన భర్తకి. "మెనీహాపీ రిటర్న్స్ ఆఫ్ ది డే!" అంటూ విష్ చేశాడు విష్ణు.

"థాంక్స్! ఈ విష్‌చేసేది రేపటిరోజున చేస్తే అర్థం పర్థం వుంటుందిగా నీ" అంటూ తన చేతిని లాక్కొంది. "దట్సాల్ రైట్ డియర్! వెడ్డింగ్ అనివర్సరీ రోజున ఒకర్నొకరు విష్ చేసుకోవాల్సిన వాళ్ళం మనమే గదా! కాకపోతే ఇవాళ ఓరోజు ముందుగా విష్ చేసుకొంటున్నాం అంతే! అన్నట్టు మరిచాను. మన వెడ్డింగ్ అనివర్సరీకి నా మిత్రుల్ని అహ్వానిద్దామనుకుంటున్నాను ఏమంటావ్?" అనడిగాడు విష్ణు. "ఓకే" అంది సౌదామిని.

ఇవాళ పదకొండో తారీఖున మామూలుకంటే ముందుగానే లేచి తలంటిస్నానం చేసి విష్ణుకునచ్చే ఆరంజీచీర కట్టుకుంది. ఫ్రిజిడేర్ తెరచి మల్లెపూలని తలనిండా పెట్టుకొంది. కాఫీకలిపి బెడ్‌రూం వేపు నడిచింది సౌదామిని.

# సింగీతం

చలనచిత్ర జగత్తులో 'దర్శకత్వ శాఖ' వెన్నుముక లాంటిది. ఐతే ఈ రోజుల్లో దర్శకత్వం చేపట్టడమంటే స్టార్టు కట్ సరిగ్గా చెప్పడం తెలిస్తే దర్శకుడయి పోయినట్టే ఫీలవుతున్నారు.

ఈ శాఖలో జేరడానికి ఏ నియమబద్ధమైన పరీక్షలు లేవు. అదృష్టం మీద ఎక్కువభాగం ఆధార పడటం జరుగుతోంది. కాని పూర్వ కాలంలో, కె. వి. రెడ్డిగారి హయాంలో దర్శకత్వ శాఖలో జేరి, ఆ బాధ్యతల్ని నిర్వహించటం 'ఓ మహాయజ్ఞం'గా పరిణమించేది. ఒక సారి కె.వి. రెడ్డిగారి దగ్గరికి ఈనాటి మనకున్న మంచి దర్శకుల్లో ఒకరైన సింగీతం శ్రీనివాస రావుగారు సహాయకుడుగా పని చేద్దాం అని వెళ్ళారుట. ఆయన 'సింగీతం'గారిని నెల రోజులు తిప్పించారట. అయినా పట్టు వదల కుండా, టైము మిస్సవకుండా వెళు తుండేవారట, ఒకరోజు రెడ్డిగారు "ఇదిగోనయ్యా! షేక్స్పియర్ బుక్. ఒథెల్లో నాటకం. దీన్ని తెలుగులోకి అనువదించాలి. చేయ గలిగితే ఆలోచిద్దాం!" అన్నారట. సింగీతం కొండంత ఆశతో పుస్తకం తీసుకొని, వెళ్ళిపోయా రట. నెలరోజులు పోయాక తాను అనువదించిన తెనుగు ప్రతి తీసు కొచ్చారట. కె.వి. రెడ్డి ప్రతి చూస్తూ—




"సరేనయ్యా! దీన్లో ఎంత సరుకు వుందో ఏమో నాకు తెలీదు. అయినా నిన్ను చేర్చుకుంటాను. నిన్ను నాశిష్యుడిగా చేర్చుకునేందుకు నీకున్న క్వాలిఫికేషను ఏమిటో తెలుసా? 'సహనం'. నీకు 'ఓపిక' వుంది. కృషిచేస్తే రాణిస్తావు!" అన్నారట రెడ్డిగారు సీరియస్‌గా.

—ఇమంది రామారావు.

---

నెమ్మదిగా తట్టి నిద్రలేపి భర్త నుదుట ముద్దు పెట్టుకోవాలను కుంది. బెడ్‌రూం ఫ్లష్‌డోర్ తెరి చింది. విష్ణు అపాటికే లేచి ఫోన్ మాట్లాడుతున్నాడు! దగ్గరగా పోయి నిలబడింది.

ఫోన్‌లో మాట్లాడుతున్నప్పుడు ఒకటి రెండుసార్లు తనవేపు చూశాడు విష్ణు. కాఫీ తెచ్చినట్లు కప్ చూపించింది. "కాసేపాగు" అన్నట్లు చూపి మళ్ళీ సంభాషణలో మునిగిపోయాడు. దాదాపు ముప్పావుగంటపాటు ఫోన్ సంభాషణ సాగింది. రిసీవర్ పెట్టేసి వీరసంగా చూసాడు విష్ణు.

"ఉందండి కాఫీ వేడిచేసి పట్టుకొస్తా" నంది సౌదామిని. ఫరవా లేదంటూ చల్లటి కాఫీని గటగటా త్రాగేశాడు విష్ణు. ఈ రెండేళ్ళ పెళ్ళి జీవితంలో విష్ణు చల్లటి కాఫీ తాగడం ఇదే మొదటిసారి. భర్త చర్య సౌదామినికి ఆశ్చర్యం కలిగించింది.

"టుడే ఈజవర్ వెడ్డింగ్ డే!" అంటూ చెయ్యి చాపింది సౌదామిని. విష్ణు సౌదామిన్ని పైకి లాక్కున్నాడు. "నువ్వీరోజు చాలా అందంగా కన్పిస్తున్నావ్ డార్లింగ్! మల్లెపూలింత ఫ్రెష్‌గా వున్నా ఎక్కడివి?" భర్త బాహువుల్లో ఇమిడిపోయిన సౌదామినికి అతడి మాటలేవీ విన్పించలేదు.

హాల్లో వెస్టెండ్ గడియారం పది గంటలు కొట్టింది ఇద్దరూ ఉలిక్కిపడి లేచారు మంచంమీద నుంచి. ఇంకో గంటలో తను ఆహ్వానించిన మిత్రులు వచ్చేస్తారు! రాజారామన్, మహబూబ్‌భాషా, క్రిష్ణభట్, ప్రేమాపరంధామన్ వీళ్ళందరూ బుర్రలో మెదిలారు అతనికి. పరుగు పరుగున బాత్ రూంకి దారి తీసాడు.

లోనికి వెళ్ళేముందు వచ్చే అతిధులకేమేమి నచ్చుతాయో హోటల్ సర్వర్‌లాగా గడగడా చెప్పేశాడు. చీర కుచ్చిళ్ళు సర్దుకుంటూ కిచెన్‌వేపు పరుగెట్టింది సౌదామిని!

"మెనీ మెనీ హాపీ రిటర్న్స్ ఆఫ్ ది డే!" అంటూ లోనికి ప్రవేశించింది మిత్రబృందం.

"నేనూ వీళ్ళతో రావడం ఆశ్చర్యంగా వుందా డాక్టర్ విష్ణుసాగర్?" అంటూ ప్రవేశిస్తున్న ప్రొఫెసర్ భట్నాగర్‌ను చూపి ఆశ్చర్యపోయారు దంపతులిద్దరూ! కాసేపు తటపటాయించి ఏదో అనబోయాడతను.

"దట్స్ ఓ.కే! మీకివాళ వెడ్డింగ్ అనివర్సరీ అని ప్రేమాపరంధామన్ చెప్పింది- అందరూ వెళతున్నారంటే నేనూ బయల్దేరాను. నా రాకవలన మీకేమైనా ఇబ్బంది కలిగితే...." భట్నాగర్ వాక్యం పూర్తిచేయకముందే అతనుముందుకురికి ఆయనచేతులు పట్టుకున్నాడు-

"సర్! మీరు నాగురువులు. తండ్రి సమానులు. ఈ సందర్భంలో మీరు మా ఇల్లు తొక్కడం మా అదృష్టంగా భావిస్తున్నాను" అంటూ సౌదామినిని తనపక్కకి లాక్కొని ఆవిడతోపాటు భట్నాగర్ పాదాలకి నమస్కారం చేశాడు అతను.

భట్నాగర్ ఇద్దర్నీ ఆప్యాయంగా పైకిలేపి విష్ణును హత్తుకొన్నాడు. ఆనందంతో మిత్రులు అందరూ చప్పట్లు కొట్టారు.

మరో గంటలో సౌదామిని తన చేతివంట చూపి అందరి ప్రశంసల్ని పొందింది. "ఇంత చక్కగా వంటచేసే ఇల్లాల్ని పొందిన నీవు చాలా అదృష్టవంతుడివి భాయీ!" అంటూ కాంప్లిమెంట్ చేశాడు మహబూబ్ భాషా. ఆ తరుణంలో సౌదామినివేపు ప్రేమగా చూశాడు విష్ణు.

విష్ణు అలా సౌదామినివేపు ప్రసరించిన ప్రేమచూపు లెన్నో! సుమారు మూడేళ్ళ క్రితం బస్‌లో తనకు సీట్ ఆఫర్ చేసినప్పుడే అతడి చూపుల్లోని ప్రత్యేకాకర్షణను గ్రహించగలిగింది సౌదామిని. కాకతాళీయంగా బీచ్‌లో ఓసారి కలిసినప్పుడు తన తండ్రీ, విష్ణు తండ్రీ బాల్య స్నేహితులన్న విషయం తెలిసినప్పుడు తమ తల్లి తండ్రులిద్దరూ ఒకర్నొకరు కౌగలించుకొంటూ మాట్లాడుకొంటున్న సమయంలో అతను తనవేపు చూసిన ఆ రెండో చూపును సౌదామిని ఎన్నటికీ మరువలేదు.

ఆ సంఘటన జరిగిన ఏడాదికల్లా తన మెళ్ళో తాళి కడుతున్న అతని కొంటెచూపును జన్మజన్మలకీ మరచిపోలేదు. ఆ తర్వాత శోభనం గదిలో, ఆ తర్వాత సూపర్ మార్కెట్‌లో, చోళా బాంక్వెట్ హాల్లో, ఇంకా ఇంకా ఎన్నో సందర్భాల్లో ఆ చూపుల పరంపరలు తన గుండెల్లో నిండిపోయాయి. విష్ణు తన భర్త కావడం పూర్వజన్మ సుకృతంగా భావించింది సౌదామిని.

మిత్రబృందం ఇంటినుండి కదిలేసరికి మూడైంది. వెళుతూ వెళుతూ ప్రొఫెసర్ భట్నాగర్ మరోసారి విష్ణును దీవిస్తూ, తను ఉదయం ఫోన్‌లో మాట్లాడిన విషయాలు కొన్నింటిని గుర్తుచేశాడు. భట్నాగర్‌తో మాట్లాడుతూన్నంత సేపూ భర్త ముఖంలోని మార్పులను గమనిస్తూ దూరంగా నిలుచుండి పోయింది సౌదామిని.

ఆరాత్రి సౌదామిని, విష్ణుకీ

ఎన్నో మధురానుభూతులను ప్రసాదించింది. ఎన్నో అమృత ఘడియల్ని ఇద్దరూ పంచుకొన్నారు. డాబాపైన పండువెన్నెల ఆకాశాన్ని తదేకంగా చూస్తున్న భర్త నడిగింది- ఉదయం ఫోన్ సంభాషణ గురించీ ప్రొఫెసర్ భట్నాగర్ వెళ్ళిపోతూ మాట్లాడిన మాటల గురించీ! అతను ఒక్కసారి నిట్టూర్చి ఏదో చెప్పాడు. సౌదామినికి ఓ విధమైన భయం ఆవరించింది. ఒళ్ళు వణకడం ప్రారంభించింది. "చలిగా వుందా? పద బెడ్రూంకి పోదాం" అని లేచాడు విష్ణు.

మర్నాడుదయం పెందరాళే లేచాడు అతను. సౌదామిని చేసిన పెసరట్లు తృప్తిగా తిని తన బ్రీఫ్ కేస్ పట్టుకొని ఇంటి గేట్ వేపు నడిచాడు. వెనుకగా వస్తున్న సౌదామిని వేపు తిరిగి "టేకిట్ ఈజీ డియర్! జస్ట్ మూడే మూడు రోజుల్లో తిరిగొచ్చేస్తానుగా! 14వ తేదీసాయంత్రం నాలుగింటికల్లా నీముందు వాలతాను. ఓకే!" అంటూ గబగబా నడిచి వెళ్ళిపోయాడు. సౌదామిని గేటువద్దే, భర్త సందు తిరిగేదాకా చూస్తూ నిలబడిపోయింది.

* * *

ప్రొఫెసర్ భట్నాగర్ "లాబ్" లో మామూలుగా కనిపించే హడావిడిలేదు. భట్నాగర్, స్టాఫ్ అందరికీ సెలవిచ్చి పంపేశాడు. ఒక్క ప్రేమా పరంధామన్ మాత్రం చేతిలో ఫైళ్ళు పట్టుకుని భట్నాగర్ వెంట అక్కడా ఇక్కడా తిరుగుతోంది.

మొట్టమొదట భట్నాగర్ కని పెట్టిన పియు 144 ఇంజక్షన్లు రెడీ చేయబడ్డాయి. "లైఫ్‌చేంబర్" సరిగా పనిచేస్తుందో లేదో ఒకసారి పరీక్షించి నిర్ధారణ చేసుకున్నారు.

తర్వాత "ఇంక్యుబేషన్" చేంబర్‌వద్ద ఇద్దరూ చేరారు దాని పక్కనే "డిస్ట్రిక్ట్ చాంబర్" దాని చుట్టూరా హై ఓల్టేజి కరెంట్ కట్టలు కట్టలుగా ఉన్నాయి. ప్రేమా పరంధామన్ ఫైలునుండి కొన్ని కాగితాల్ని తీసి భట్నాగర్ చేతి కందించింది. భట్నాగర్ వాటిని జాగ్రత్తగా పరిశీలించడం ప్రారంభించాడు. ఈలోగా "మైక్రో సర్జికల్" కిట్‌ను రెడీచేసింది ప్రేమాపరంధామన్. విష్ణుసాగర్ రావడం చూసి సాదరంగా ఆహ్వానించాడు.

భట్నాగర్ చేతిని తన రెండు చేతుల్తో పట్టుకున్నాడు వినయంగా విష్ణు. "బై దిబై -నీ వైఫ్‌కీ సంగతి చెప్పావా?" అనడిగాడు భట్నాగర్.

"నో సర్! ఏమీ చెప్పలేదు. 14వ తారీఖు సాయంత్రానికల్లా యింట్లో వుంటానని మాత్రం చెప్పాను" - "గుడ్‌పద" అంటూ విష్ణును లైఫ్ చేంబర్ దగ్గరికి తీసుకు వెళ్ళాడు భట్నాగర్. అక్కడ ప్రేమా పరంధామన్ విష్ణను చూపిచిన్నగా నవ్వి ఆహ్వానించింది.

భట్నాగర్ విష్ణుకి వేరే బట్టలిచ్చి తొడుక్కోమని చెప్పాడు. విష్ణు బట్టలు మార్చుకుంటుండగా——

"చూడు- విష్ణుసాగర్! నాకు పరిచితులైన వ్యక్తుల్లో నీవొక్కడివే యీ ప్రయోగానికి అర్హుడివని నిర్ధారణ చేసుకున్నాక-నేను తల పెట్టిన పరిశోధనల్ని నీ మీదే చేద్దామన్న నిర్ణయానికొచ్చాను. ఇటువంటి పరిశోధనలు ప్రపంచ మంతటా జరుగుతున్నాయి. ఐతే యిలాటి ప్రయోగం జరగడం యిదే మొదటిసారి. నీవల్ల నాకు గొప్ప ఖ్యాతిలభించే అవకాశం నమ్మకం పరిపూర్ణంగా నాకుంది."

విష్ణు, భట్నాగర్ చేతులు పట్టుకున్నాడు. "సర్! నన్నింతటివాడ్ని చేసింది మీరే. మీ రిసెర్చ్ స్టూడెంట్లలో "పిహెచ్‌డి" పొందిన మొదటివాడిని నేనే. మీ ప్రయోగం విజయవంతంకావాలని మనస్ఫూర్తిగా అనుకొంటున్నాను. మీ పేరు ప్రఖ్యాతులకు కారణభూతుడనైతే నాకంతకన్నా దొరికే మరో అదృష్టం లేదు" భట్నాగర్ చలించిపోయాడు. విష్ణను మన సారా హృదయానికి హత్తుకున్నాడు. తన కంటిలోని ఆనంద భాష్పాలను తుడుచుకొంటూ ప్రేమాపరంధామన్ వేపు తిరిగి "ప్రేమా! అన్నీ రెడీయేనా?" అనడిగాడు. ఆవిడ అన్నీ రెడీ అన్నట్లు తలాడించింది.

నిగనిగలాడే గాజుతో తయారు చేయబడిన "లైఫ్‌చేంబర్" లో విష్ణు ప్రవేశించాడు. లోపల బెడ్ మీద పరుండబెట్టి అతడి చేతికి సియు 144 ఇంజక్షనిచ్చింది ప్రేమాపరంధామన్. అతను మాత్రం లోపల్నించి చేంబర్ మూసివేశారు, భట్నాగర్ ప్రేమా పరంధామన్. చేంబర్ పక్కనున్న మీటలు కొన్నింటిని నొక్కాడు భట్నాగర్.

విష్ణుకి మెల్లగా నిద్రపట్టిన కాసేపటికి, భట్నాగర్ ఒక ప్రత్యేకమైన పరికరంతో "మైక్రోసర్జికల్ కిట్" తో తన రెండు చేతులను "లైఫ్"చేంబర్‌లోనికి పోనిచ్చాడు. అతనిచేతినుండి ఓ జీవకణం వేరు చేయబడింది. దాన్ని ఓ కిటికీ గుండా బయటకుతీసి ఓ చిన్న

బాటిల్ లో పెట్టాడు భట్నగర్.

ప్రేమాపరంధామన్ ను చేంబర్ ప్రక్కనే కూర్చోమని పురమాయించి తను ఇంతకుముందు ఉపయోగించిన పరికరంతోనే పియు 144 ఇంజక్షన్లను అతనికి ఎలా ఇవ్వాలి, ఎప్పుడివ్వాలన్న సంగతులను వివరించి జీవకణంవున్న బాటిల్ తో గబగబా "ఇంక్యుబేషన్" చేంబర్ వేపు నడిచాడు భట్నగర్.

విష్ణు దీర్ఘ నిద్రలో వున్నాడు. అతడి హృదయం, మెదడు ఇతర అవయవాల పరిస్థితిని "లైఫ్" చేంబర్ పక్కనే అమర్చబడిన పరికరాలు నిముష నిముషానికి తెలుపుతున్నాయి. ప్రేమాపరంధామన్ ఆ పరికరాలు చూపే సంఖ్యల్ని ఓ పుస్తకంలో నోట్ చేసుకుంటోంది. అప్పుడప్పుడు విష్ణుకివ్వాల్సిన పియు 144 ఇంజక్షన్లనిస్తోంది. చేంబర్ లోని ఉష్ణోగ్రత వివరాలను భట్నగర్ కు "ఇంటర్ కాం" మూలంగా చెబుతూ ఎంతో జాగ్రత్తగా తన పనులు తాను చేసుకుపోతున్నది.

విష్ణు చేతినుండి వేరుచేయబడిన జీవకణం "ఇంక్యుబేషన్ చేంబర్" లో వుంచాడు భట్నగర్. చేంబర్ పక్కనే వున్న మీటలు నొక్కి చేంబర్ లో ఉదజని ప్రాణవాయువుల్ని ప్రవేశపెట్టాడు. మరో మీటనొక్కి చేంబరులో ఉష్ణోగ్రతను క్రమేణా పెంచాడు. లోపలుంచబడిన జీవకణంనుండి సంభ్రమాశ్చర్యాలు గొలిపే తీరులో ఓ మానవాకారం ఏర్పడుతోంది.

భట్నగర్ నుదుట చెమట బిందువులేర్పడుతున్నాయి. వాటిని పదే పదే తుడుచుకొంటూ పక్కనున్న "టైమర్" ను గమనిస్తూ మీటలు నొక్కుతున్నాడు.

కాసేపటికి చేంబరులో "ఇన్ ఫ్రరెడ్" కిరణ ప్రసారణ జరిగింది. చేంబర్ లోని ఆ మానవాకారం క్రమేణా విష్ణుసాగర్ రూపం దాల్చింది. అక్కడ "లైఫ్ చేంబర్" లో నిద్రపోతున్న విష్ణుసాగర్ కూ-ఇక్కడ "ఇంక్యుబేషన్" చేంబర్ లో ఏర్పడిన విష్ణుసాగర్ కూ ఏమాత్రం తేడాలు లేవు! భట్నగర్ ముఖంలో ఆనందం తాండవించింది. తన ప్రయోగం ఫలించింది!

ఇంతలో ప్రేమాపరంధామన్ గట్టిగా కేకవేసింది. "సార్ లైఫ్ చేంబరు పరికరాలు పనిచేయడం మానివేశాయి! అంటే విష్ణుసాగర్ చచ్చిపోయాడనుకుంటున్నాను" తర్వాత నోట మాట పెగల్లేదు

ప్రేమాపరంధామన్‌కి! భట్నాగర్ వెంటనే లైఫ్‌చేంబర్ వేపు పరుగు తీశాడు. "ఇవ్వాల్సిన ఇంజక్షన్ లను జాగ్రత్తగా ఇచ్చావా ప్రేమా?" అని అరిచాడు.

"ఇచ్చాను సార్!" అంటూ భయపడిపోతూ చెప్పి కుర్చీలో కూలబడిపోయింది. "లైఫ్ చేంబర్" పరికరాల్ని ఓసారి తనిఖీ చేసాడు భట్నాగర్. విష్ణుసాగర్ మరణించాడన్నది నిర్ధారణైంది. వెంటనే ఆలస్యం చెయ్యకుండా "ఇంక్యుబేషన్ చేంబర్ వద్దకు వెళ్ళాడు. గబగబా మీటలునొక్కి-ఇన్‌ఫ్రరెడ్ కిరణాల్ని ద్విగుణీకృతం చేసాడు.

కాసేపట్లో లోపల జీవకణం నుండి ఉద్భవించిన విష్ణుసాగర్ మెల్లగా వూపిరి పీల్చడం ప్రారంభించాడు. భట్నాగర్ చేంబరు తలుపులు తెరచి అతనిని బయటికి నడిపించాడు. తిన్నగా తన గదిలోకి తీసుకువెళ్ళాడు. బట్టలు తొడిగించి అతడనో కుర్చీలో కూర్చుండబెట్టి తలమీద ఓ పరికరం అమర్చి, అతడి మెదడు శక్తిని పరీక్షించాడు. మెదడు సక్రమంగానే పని చేస్తోంది.

ఐతే కొన్ని అతి సున్నితమైన జ్ఞాపకాలను మెదడు విశదీకరించలేకపోతోంది. ఐనా ఫరవాలేదనుకున్నాడు భట్నాగర్. కాలండర్‌లో తేదీ చూశాడు. 14! వాచీ చూశాడు నాలుగైంది. విష్ణుతో "చూడు డాక్టర్ విష్ణుసాగర్! నీ భార్య సౌదామిని నీకోసం ఎదురు చూస్తుంటుంది. తిన్నగా ఇంటికి వెళ్ళిపో!" అన్నాడు. అతను కుర్చీలోంచి లేచి బయటికి నడచి వెళ్ళిపోయాడు.

భట్నాగర్ గబగబా "లైఫ్ చేంబర్" దగ్గరకు వెళ్ళాడు. లోపల తన ప్రియశిష్యుడు సాగర్ నిర్జీవంగా పడుకొని వున్నాడు. పెల్లుబికే దుఃఖాన్ని ఆపుకొంటూ, సాగర్ బాడీని "డిస్ట్రక్టు చేంబరు"కు మార్చి మీట నొక్కాడు.

మరుక్షణం చేంబరు లోపల హై వోల్టేజ్ విద్యుత్ ప్రసారం జరిగింది. కళ్ళుమూసి తెరిచేలోగా అతని బాడీ మాయమయింది. ఇదంతా గుడ్లప్పగించి చూస్తున్న ప్రేమాపరంధామన్ చేతిని పట్టుకున్నాడు భట్నాగర్.

నీరసంగా "ప్రేమా ఈ రహస్యం నీతోనే వుంచు. పెద్ద పొరబాటు జరిగిపోయింది. సాగర్ చేతినుండి తీయబడిన జీవకణం నుండి అతడి డూప్లికేట్‌ను సృష్టించగలిగాను. ప్రయోగా

నంతరం డూప్లికేట్ విష్ణును కొన్ని పరీక్షలు జరిపి ప్రయోగంలో మనం ఎంతవరకు సఫలీకృతులమైనామో నిర్ధారణ చేసుకొని తర్వాత అతడిని "డిస్ట్రక్ట చేంబరు"లో నిర్మూలించివేసి, ఒరిజినల్ సాగర్‌ను నిద్రనుండి లేపి, మనం సాధించిన ఈ ఘనతను ప్రపంచానికి చాటుదామనుకున్నాను.

ప్లాన్ తారుమారై ఒరిజినల్ విష్ణుప్రయోగం పూర్తిగాకముందే మరణించడం నేనెదురు చూడలేదు. ఎక్కడ తప్పు జరిగిందో తెలీడం లేదు" అంటూ చతికిలబడ్డాడు భట్నగర్. కాసేపటికి తేరుకున్నాక అతడికేదో జ్ఞాపకం వచ్చి లేచి తడబడుతూ తన టేబిల్ వద్దకు నడిచాడు.

అక్కడ తను చింపి పారేసిన బైకోవిస్కీ ఉత్తరం ముక్కలు కనిపించాయి. అవసరంగా ఆ ముక్కల్ని కలిపి బైకోవిస్కీ తనకు రాసిన నాలుగు వాక్యాలు చదివాడు.

డియర్ భట్నగర్,

నువ్వు కనిపెట్టిన పియు 144 ఇంజక్షన్లు నేనూ కనిపెట్టగలిగాను. ఐతే వాటివలన "లైఫ్‌చేంబర్"లో వుంచబడే వ్యక్తికి ప్రాణాపాయంకలిగే ప్రమాదం వుంది. పియు 144 ను వాడేటప్పుడు చాలా జాగ్రత్తలు తీసుకోవలసి వుంది. పైగా "క్లోనింగ్" విధానంలో డూప్లికేట్ జీవాలను సృష్టించే పద్ధతిమీద మరికొంత పరిశోధనలు జరపాల్సి వున్నది. ఇందులో మనం అవసరపడకుండా వుంటే మంచిదేమోనని భావిస్తున్నాను.

ఇట్లు నీ స్నేహితుడు,
బైకోవిస్కీ,
మాస్కో యూనివర్శిటీ.

ఉత్తరం చదువుకొని నిశ్చేష్టుడైపోయాడు భట్నగర్.

* * *

భర్త రాకకోసం ఎదురు చూస్తూ నిలబడిన సౌదామినికి దూరంగా భర్తరావడం చూపించి. ఈ మూడు రోజులూ మూడు యుగాలుగా గడిపింది. పరుగున వెళ్ళి విష్ణును వాటేసుకొంది. ఆప్యాయంగా అతడ్ని ఇంట్లోకి తీసుకువచ్చింది. విష్ణు ఏమీ మాట్లాడకుండా వచ్చి సోఫాలో కూర్చున్నాడు. సౌదామినివేపు ఓ విధంగా చూసాడు. భర్త అలాంటి చూపు చూడటం ఇదే మొదటి సారి. ఇంతకుముందెన్నడూ తను ఎరగని చూపది!! •